

ఎస్‌ఐ పరశురామ్ భార్యకు పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం

బెంగళూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): యాదగిరి టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మేరకు ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగంతోపాటు పరిహారం అందించేలా ప్రభుత్వ నిర్ణయించిందని హోంశాఖ మంత్రి పరమేశ్వర్ తెలిపారు. ఎస్‌ఐ మృతిపై యాదగిరి ఎమ్మెల్యే చెన్నారెడ్డి పాటిల్ తున్నూరు, ఆయన కుమారుడు పంపనగౌడ కారణమని ఎస్సై భార్య ఆరోపించిన మేరకు సిట్ ద్వారా దర్యాప్తు జరిపిస్తామన్నారు. ఆదివారం సిట్ అధికారులు యాదగిరికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ముదురుతున్న వివాదం



ముడాపై ఎన్నెన్నో సందేహాలు

మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) 1992లో కెసరె గ్రామంలో 3.16 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంది. ప్లాట్లు చేసేందుకు 1996-98 మధ్య వ్యవసాయం కోసం డీనోటిఫై ఎందుకు చేశారనేది సందేహంగా ఉంది. అప్పుడు సిద్దరామయ్య డీసీఎంగా ఉండేవారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రికార్డుల ప్రకారం సాగుకోసం డీ నోటిఫికేషన్ చేసిన భూమిని దేవరాజ అనే వ్యక్తి 2004లో సిద్దరామయ్య బావమరిది మల్లికార్జున స్వామికి విక్రయించారు. విక్రయాలకు ముందే దేవరాజ పేరిట ఉన్న భూమిలో ఇంటి స్థలాల కోసం తీసుకున్నవారు పరిహారం ఇవ్వలేదని తెలుస్తోంది. సిద్దరామయ్య బావమరిది సదరు భూమిని కొనుగోలు చేసి పసుపు కుంకుమగా అక్క, సిద్దరామయ్య భార్య పార్వతికి ఇచ్చారు. 2021లో భూమి కోల్పోయిన ప్రదేశంలోనే 600కు పైగా ఇంటి సైట్లు ఉన్నా అత్యంత విలువైన విజయనగర లే అవుట్‌లోని 14 స్థలాలు ఎందుకు కేటాయించారనేది ప్రశ్నలకు కారణమవుతోంది. ముడాకు సంబంధించిన వివాదంలో మలుపులు తిరిగినవేళ సిద్దరామయ్య ఏదో ఒక హోదాలో ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారు.

ముడా అక్రమాలపై గవర్నర్ నిర్ణయమే కీలకం

- ఇప్పటికే ముఖ్యమంత్రికి నోటీసులు
- న్యాయపోరాటానికి సీఎం సన్నద్ధం
- గవర్నర్ తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం
- బీజేపీ పాదయాత్రకు పోటీగా జనాందోళన సభలు



బెంగళూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాల మధ్య.. మరోవైపు ముఖ్యమంత్రి, గవర్నర్ మధ్య వివాదం ముదురుతోంది. రాజకీయాల్లో ఏదీ శాశ్వతం కాదు. శత్రువులు కూడా మిత్రులవుతుంటారు. 2011లో యడియూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఓ అవినీతికి సంబంధించి అప్పటి గవర్నర్ హంసరాజ్ భరద్వాజ్ విచారణకు అనుమతి ఇచ్చారు. అప్పుడు రాష్ట్రంలో బీజేపీ, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండేది. అప్పుడు గవర్నర్ తీసుకున్న నిర్ణయానికి ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్దరామయ్య మద్దతు ఇచ్చారు. యడియూరప్ప అధికారం కోల్పోయి జైలుకు వెళ్లారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి సిద్దరామయ్య మాత్రం గవర్నర్‌కు నోటీసులిచ్చే అధికారం లేదని అంటున్నారు. కానీ, యడియూరప్పతోపాటు ఆయన కుమారుడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మాత్రం విచారణకు అనుమతులు ఇవ్వాలని, రాజ్యాంగ పరంగా చర్యలు తీసుకోవాలని అంటున్నారు. ముడా అక్రమాల్లో సీఎం సిద్దరామయ్య రాజీనామా చేయాలని బీజేపీ, జేడీఎస్ సంయుక్తంగా పాదయాత్ర చేస్తున్నాయి. వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ 'నైతిక ప్రశ్నలు' పేరిట సభలు నిర్వహిస్తోంది. రెండు పార్టీలు మైదానంలో దిగి పోటీ పడుతుండగా గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ తీసుకునే నిర్ణయమే కీలకం కానుంది. సిద్దరామయ్యకు వ్యతిరేకంగా అనుమతులు ఇస్తారా..? అనేది కుతూహలంగా మారింది. ఇప్పటికే సీఎం సిద్దరామయ్యకు షోకాజ్ నోటీసులు జారీ చేసి మూడు రోజులు ముగిసింది. వారంలోగా సీఎం వివరణ ఇవ్వాల్సి ఉంది. ఒకవేళ సీఎం సిద్దరామయ్య చీఫ్ సెక్రటరీ ద్వారా ఇచ్చే వివరణ సమగ్రంగా ఉందని భావిస్తే ఈ అంశానికి తెరపడుతుంది. లేదంటే గవర్నర్ నిర్ణయం ఏ విధంగా ఉంటుందనే రాజకీయంగా చర్చనీయాంశంగా ఉంది. సీఎంను ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తే హైకోర్టు, సుప్రీంకోర్టు ద్వారా న్యాయ పోరాటం చేస్తారు. కానీ రాజకీయంగా సిద్దరామయ్య భవిష్యత్తు ఏమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారనుంది. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ జైలుకు పంపినా ఆయన రాజీనామా చేయలేదు. ఇదే తరహాలోనే కేసు దాఖలైనప్పుడు జైలుకు వెళ్లడం, రాజీనామా చేయడం నైతిక బాధ్యత మినహా చట్టపరమైన నిర్ణయం కాదు. గవర్నర్ అనుమతులు ఇచ్చి కోర్టులో విచారణ ప్రారంభమైతే ఆ వెంటనే సీఎం రాజీనామా చేయాల్సి ఉంటుందని చట్టంలో ఎక్కడా లేదు. ముఖ్యమంత్రి అధీనంలో ఉండే దర్యాప్తు సంస్థలు పారదర్శకంగా విచారణలు చేయడం అసాధ్యమని, కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఇవ్వాలని ఫిర్యాదుదారుడు డిమాండ్ చేస్తే అప్పుడు సీఎంకు ఉచ్చు బిగించినట్లు అవుతుంది. ఒకటి రాజీనామా చేయాలి లేదా కేజ్రీవాల్ తరహాలో పట్టుదలతో అధికారంలో కొనసాగాలి. కేజ్రీవాల్, హేమంత్‌సోరెన్ పార్టీలు సొంత నేతృత్వంలో కొనసాగేవి. కానీ ఇక్కడ జాతీయ పార్టీ కాంగ్రెస్ కావడంతో నిర్ణయం తీసుకునేది సిద్దరామయ్య కాదు... ఢిల్లీలోనే ఉన్న రాహుల్‌గాంధీతోపాటు అగ్రనేతలు. 2011లో ఇదే తరహా సన్నివేశం బీజేపీలో కొనసాగింది. అప్పటి గవర్నర్ హంసరాజ్ భరద్వాజ్‌ను బీజేపీ నాయకులు ఢిల్లీ కాంగ్రెస్ ఏజెంట్ అంటూ ఆరోపించారు. యడియూరప్ప రాజీనామా అనివార్యం కావడంతో సీఎం పీఠం ఎక్కేందుకు అనంతకుమార్, సదానందగౌడ, జగదీశ్‌శెట్టర్ ప్రయత్నించారు. ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్‌లోనూ అటువంటి వారు లేరని చెప్పలేం. బహిరంగంగా గవర్నర్ తీరుపట్ల వ్యతిరేకిస్తున్నా లోపల మాత్రం మరో విధంగా ఉండవచ్చు. నాయకత్వ మార్పు చేయాలని అధిష్ఠానం నిర్ణయిస్తే డీకే శివకుమార ఎంత ప్రయత్నించినా అడ్డుకునేందుకు సతీశ్ జార్కిహోళి, ఎంబీ పాటిల్, జమీర్ అహ్మద్, కేఎన్ రాజణ్ణ లాంటి మరి కొందరు తీవ్రంగానే ప్రయత్నిస్తారు. ఇద్దరు గొడవపడితే మూడోవారికి లాభమని, దళిత కోటాలో తనను ముఖ్యమంత్రిగా చేయాలని హోంశాఖ మంత్రి పరమేశ్వర్ ప్రయత్నాలు చేస్తున్నారు. సిద్దరామయ్య అధికారంలో కొనసాగేందుకు ప్రయత్నిస్తారు. సాధ్యం కాకుంటే డీకే శివకుమార్ సీఎం అయ్యేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ప్రజాదరణను ఓర్వలేకనే కుట్ర

ముఖ్యమంత్రికి రాష్ట్ర నాయకులంతా అండ

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్



మీడియాతో ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం, డీసీఎం

బెంగళూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గ్యారెంటీ పథకాలకు వస్తున్న ప్రజాదరణ ఓర్వలేకనే ముఖ్యమంత్రి సిద్దరామయ్యతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వంపై కుట్ర పన్నారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మండిపడ్డారు. ఆదివారం బెంగళూరులో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలాతో కలసి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ నోటీసు ఇవ్వడంపై మండిపడ్డారు. సిద్దరామయ్య ఎలాంటి రాజకీయ నాయకుడనేది రాష్ట్ర ప్రజలందరికి తెలుసు అన్నారు. రాష్ట్ర పార్టీ నాయకులంతా సీఎంకు అండగా ఉన్నారని అన్నారు. బీజేపీ, జేడీఎస్ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్నాయన్నారు. కేంద్ర బడ్జెట్‌లో కర్ణాటకకు జరిగిన అన్యాయంపై మాట్లాడలేదని మండిపడ్డారు. ప్రజ్వల్ రేవణ్ణ అంశాన్ని, విజయేంద్ర అవినీతి గురించి మాట్లాడలేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నారన్నారు. 2018లో కాంగ్రెస్ - జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చింది కేంద్రంలోని బీజేపీ నాయకుల ఆదేశాలతోనే అన్నారు. అదే తరహాలోనే మరోసారి రాజకీయ ద్వేషాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. గవర్నర్ నిర్ణయం దురదృష్టకరమన్నారు. సమస్య ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, కానీ ముఖ్యమంత్రిపై కుట్ర సమంజసం కాదన్నారు. అవినీతి గురించి బీజేపీ మాట్లాడడం హాస్యాస్పదమని, విజయేంద్రపై వచ్చిన ఆరోపణలు ఎన్ని ఉన్నాయో అందరికీ తెలిసిందే అన్నారు.

సిద్దరామయ్యను ఇబ్బంది పెడితే రోడ్డెక్కుతాం

అహింద నాయకుల హెచ్చరిక

బెంగళూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్‌కు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలని, బీజేపీ - జేడీఎస్ చేపట్టిన పాదయాత్ర రద్దు చేసుకోవాలని లేనిపక్షంలో రోడ్డెక్కి నిరసన చేయాల్సి ఉంటుందని అల్పసంఖ్యాత, హిందుళిత, దళిత (అహింద) నాయకులు హెచ్చరించారు. దావణగెరెలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ సోమవారం దావణగెరెలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి రాయణ్ణసర్కిల్ దాకా ర్యాలీ చేస్తామని అహింద నాయకుడు చమన్‌సాబ్ తెలిపారు. రాజ్‌భవన్ చలో కార్యక్రమం చేపడతామన్నారు. అవినీతి మచ్చలేని సిద్దరామయ్యను లక్ష్యంగా చేసుకుని వేధించాలనుకుంటే తమ సత్తా చూపుతామని హెచ్చరించారు. అన్ని సామాజిక వర్గాలకు సముచిత న్యాయం కల్పించడంతోపాటు అవినీతి ఆరోపణలు లేని ఏకైక రాజకీయ నాయకుడు సిద్దరామయ్య అన్నారు. కేంద్రప్రభుత్వం గవర్నర్ ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చతెచ్చేలా వ్యవహరిస్తోందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ఏమి నాయకుడని ప్రశ్నించారు. తండ్రిని జైలుకు పంపించిన వారెవ్వరో తెలుసుకుంటే బాగుంటుందని హితవు పలికారు. కుమారస్వామి కుటుంబం గురించి రాష్ట్రంలోని ఏడుకోట్ల మందికి తెలుసు అన్నారు. 'ముడా'కు సంబంధించి రెండు సార్లు రికార్డులను సిద్దరామయ్య బహిరంగం చేశారని అన్నారు. 80శాతం మంది రాష్ట్ర ప్రజలు సిద్దరామయ్యకు అనుకూలంగా ఉన్నారని, ఏమాత్రం ఇబ్బంది కలిగించినా రాష్ట్రమంతటా పోరాటం చేస్తామని తెలిపారు.



జేడీఎస్ భారీ జెండాతో కార్యకర్తలు



పాదయాత్రలో పాల్గొన్న కుమారస్వామి, విజయేంద్ర తదితరులు

దళితుల భూమి ఆక్రమించినట్లు నిరూపిస్తే

రాజకీయాలకు గుడ్‌బై

- ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంతోపాటు వ్యాపారాల చేశానని, 68 ఎకరాల దళితుల భూమిని ఆక్రమించాననే ఆరోపణలను కుమారస్వామి నిరూపిస్తే రాజకీయాలకు గుడ్‌బై చెబుతానని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సవాల్ విసిరారు. చెన్నపట్టణలో ఆదివారం జనాందోళన సభలో ఆయన మాట్లాడుతూ కుమారస్వామి తన ఆస్తుల గురించి మాట్లాడారని, ముందుగా మీ సోదరుడు బాలకృష్ణగౌడ, ఆయన కుటుంబంతోపాటు మీ బినామీలు మైసూరు, శ్రీరంగపట్టణ పరిధిలో ఎంత భూములు ఆక్రమించుకున్నారో బహిరంగం చేస్తారా..? అని ప్రశ్నించారు. తనతోపాటు తన భార్య తమ్ముడు, చెల్లెలిపైన కేసులు వేయలేదా... అన్నారు. కుమారస్వామిది హిట్ అండ్ రన్ రాజకీయం అన్నారు. పెన్‌డ్రైవ్ వివాదంలో రోజుకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. కుమారస్వామి టూరింగ్ టాకీస్ అందరికీ తెలుసు అన్నారు. బీజేపీ, జేడీఎస్ చేస్తున్నది పాప విమోచన యాత్ర అంటూ వ్యంగ్యం చేశారు. బీజేపీ పాలనలో 25 అవినీతి ఆరోపణలు రాగా ఎందుకు సీఎం రాజీనామా చేయలేదని ప్రశ్నించారు.



చెన్నపట్టణలో ప్రసంగిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

కప్పం కోసమే అవినీతి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

రెండోరోజూ ఉత్సాహంగా పాదయాత్ర

బెంగళూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గాంధీ కుటుంబానికి కప్పం కట్టేందుకే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సొమ్మును లూటీ చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మండిపడ్డారు. రెండోరోజు పాదయాత్ర ఆదివారం బిడదిలోని శివదర్శిని హోటల్ నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ పాదయాత్ర ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని వెలుగులోకి తెచ్చేందుకే తమ పోరాటం అన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య మచ్చలేని రాజకీయ నాయకుడని చెప్పుకొన్నారని, ప్రస్తుతం అవినీతి హారం వేసుకున్నారని ఆరోపించారు. యాదగిరి సబ్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్ ఆకస్మిక మృతి వెనుక ఎంతటి ఒత్తిడి ఉందో తెలుస్తోందన్నారు. ఎస్సీ ఎస్టీల అభివృద్ధికి కేటాయించిన గ్రాంట్లు దిగమింగారని ఆరోపించారు. సీఎం రాజీనామా డిమాండ్‌లో ఎటువంటి అనుమానం లేదన్నారు. రెండోరోజు పాదయాత్ర ఉత్సాహంగా సాగింది. బీజేపీ సీనియర్ నేత యడియూరప్ప, కేంద్రమంత్రి కుమారస్వామి సహా ముఖ్యనేతలందరూ పాల్గొన్నారు.



పాదయాత్రలో బీజేపీ, జేడీఎస్ నాయకులు, కార్యకర్తలు

రెండు నెలలే గడువు

- తీరు మారకుంటే వేటు తప్పదు
- బీజేపీ, జేడీఎస్ ఆరోపణలు చేస్తుంటే నిద్రపోతున్నారా..?
- మంత్రులపై అధిష్ఠానం ఆగ్రహం



బెంగళూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాలపై అధిష్ఠానం దృష్టి సారించింది. ఆదివారం హుటాహుటిన పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా బెంగళూరుకు చేరుకున్నారు. వారి పర్యటన ముందుగా ఖరారు కానున్నా అగ్రనేత రాహుల్‌గాంధీ సూచనతోనే వారు వచ్చినట్లు తెలుస్తోంది. అత్యవసరంగా మంత్రులందరిని బెంగళూరులో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నేరుగా సీఎం అధికారిక నివాసం కావేరికి చేరుకున్నారు. సీఎం, డీసీ ఎంతో కూలంకుషంగా చర్చించారు. మూడు రోజులుగా సాగుతున్న పరిణామాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత మీడియా ముందుకు వచ్చి సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ, జేడీఎస్ నాయకులు కుట్ర పన్నారని ఆరోపించారు. అనంతరం మంత్రులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. మీరు జిల్లాలకు మంత్రులా... రాష్ట్రానికా అంటూ కేసీ వేణుగోపాల్ పలువురిపై విరుచుకుపడినట్లు తెలుస్తోంది. మీరు సమగ్రంగా పనిచేసి ఉంటే లోక్‌సభ ఎన్నికల్లో కనీసం 15 స్థానాలు గెలుపొందేవారమని అన్నారు. రెండు నెలల్లో మీ కార్యవైఖరి మారాలని లేని పక్షంలో దసరాకు మంత్రివర్గ విస్తరణ తప్పదని హెచ్చరించారు. బీజేపీ - జేడీఎస్ నుంచి అంతగా ఆరోపణలు చేస్తున్నా ఏం నిద్రపోతున్నారా..? అంటూ పలువురిని మందలించినట్లు తెలుస్తోంది. మీ నిర్లక్ష్యంతోనే చెడ్డపేరు వస్తోందని మందలించినట్లు సమాచారం. పరోక్షంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో గ్రూపు విభేదాలు లేవని సంకేతం ఇచ్చేలా హెచ్చరించారు. ఢిల్లీ నుంచి వచ్చిన కీలక నేతలు హడావుడిగా వచ్చినా మంత్రులను దారిలోకి తెచ్చుకోవడంతోపాటు సీఎం సిద్దరామ్యకు మనోధైర్యాన్ని ఇచ్చేలా వ్యవహరించారు.


మితిమీరిన సైబర్ నేరగాళ్లు

ఆరు నెలల్లో 9,260 కేసులు

రూ.845 కోట్లు కోల్పోయిన బెంగళూరు వాసులు



బెంగళూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఐటీ నగరిగా పేరొందిన బెంగళూరు ప్రజలు కేవలం ఆరు నెలల వ్యవధిలోనే సైబర్ నేరాలతో రూ. 845 కోట్లు కోల్పోయారు. డెబిట్, క్రెడిట్‌కార్డుల మోసాలు గతంతో పోలిస్తే భారీగా పెరిగాయి. 2024 జనవరి నుంచి జూన్ వరకు 9,260 సైబర్ నేరాలు నమోదయ్యాయి. వీటిలో 1485 కేసులు డెబిట్, క్రెడిట్ కార్డులకు సంబంధించినవి ఉన్నట్లు నగర పోలీసు అధికారుల ద్వారా తెలుస్తోంది. వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్ సర్వీస్‌ను ఉపయోగించుకుని మోసాలకు పాల్పడ్డారు. విదేశీ నెంబర్ల నుంచి ఫోన్ చేసి మోసాలకు పాల్పడుతుండడంతో వారిని గుర్తించడం సాధ్యం కావడం లేదు. ఫిర్యాదులు చేసినవారిలో సగంమంది లావాదేవీలకు ముందే పబ్లిక్ వైఫై ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఓ పోలీసు ఉన్నతాధికారి సమాచార మేరకు +44, +7, +07 వంటి భిన్నమైన దేశాల నుంచి వచ్చిన కోడ్‌లుగా ఉన్నాయి. +91 ఇండియా నుంచి వచ్చిన ఫోన్‌కాల్స్ లేవని తెలుస్తోంది. హోటళ్లు, లాంజ్‌లు ఇతర ప్రదేశాలలో వై-ఫై వాడుకున్న వారి ద్వారానే లూటీ చేసినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది తొలి రెండు నెలల్లోనే రూ.240 కోట్లు ఇలా లూటీ చేశారని తెలుస్తోంది. పబ్లిక్ వై-ఫై నెట్‌వర్క్‌లకు సాధారణంగా ఎన్‌క్రిప్ట్ వ్యవస్థ (సెక్యూరిటీ) ఉండదు. తద్వారా సులభతరంగా సైబర్ నేరగాళ్లు నెట్‌వర్క్ ద్వారా డేటాను పొందుతారు. సమగ్ర సమాచారాన్ని తెలుసుకునేముందే వై-ఫై ద్వారా లావాదేవీలను జరుపుకోరాదు. ఎన్‌క్రిప్ట్ చేసిన ట్రాన్సాక్షన్‌ను విపిన్‌లకు మార్చు చేసుకోవాలి.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.26	1,627.31
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,36,574	17,508
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,30,855	4176
సామర్థ్యం (టీఎంసీలు)	98.88	84.30

శ్రీనంద పాఠశాలలో భజన



భజన సంగీత కార్యక్రమంలో విద్యార్థినులు

బళ్లారి సిటీ, ఆగస్టు 4: విద్యానగర్‌లోని శ్రీనంద రెసిడెన్షియల్ పాఠశాలలో ఆదివారం శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమం (అవధూత దత్తపీఠం) ఆధ్వర్యంలో భజన సంగీతం ఏర్పాటు చేశారు. వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొని పాటలు పాడుతూ చక్కని సంగీత వాతావరణాన్ని సృష్టించారు. విద్యార్థులు తమ మధురమైన కంఠస్వరంతో రకరకాల పాటలు పాడి తమ ఆవేదలను క్షణంలో మరిచిపోయారు. మొబైల్స్‌తో కాలక్షేపం చేస్తున్న చిన్నారులకు సంగీతాభిరుచిని నేర్పే భజన సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన పాఠశాల అధ్యక్షుడు గాంధీని విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు. ఈసందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఏరంగంలోనైనా విజయం సాధించవచ్చునని, కాని సంగీత రంగంలో ఎవరు విజయం సాధిస్తారో వారు ప్రపంచాన్ని గెలిచినట్లని అన్నారు. న్యాయనిర్ణేతలుగా శ్రీమతి కరుణ, సుభద్రమ్మ వ్యవహరించారు. ప్రథమ స్థానంలో నిలిచిన చిన్నారికి మైసూర్ అవధూత దత్తపీఠం అవార్డు ప్రదానం చేస్తుందన్నారు.

నదీ తీరవాసులు అప్రమత్తంగా ఉండాలి



తుంగభద్ర తీరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ విశ్వనాథ్

సిరుగుప్ప, ఆగస్టు 4: తుంగభద్ర నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని తహసీల్దార్ విశ్వనాథ్ తెలిపారు. సిరుగుప్ప పట్టణం చివర దేశనూరు రోడ్డు మార్గంలో తుంగభద్ర నది వంతెన వద్ద పరిస్థితులను ఆయన సమీక్షించారు. పై భాగంలో భారీ వర్షాలు కురిసినట్లయితే పంట పొలాలు నీటిలో మునగడమే కాకుండా గ్రామాలలోకి కూడా నీరు వచ్చే అవకాశాలున్నాయన్నారు. కావున ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఆయన తెలిపారు. సురక్షిత ప్రాంతాలకు వెళ్లడం ఎంతో సమంజసమైనదని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తాలుకా పంచాయతీ ఈవో పవన్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, విలేజ్ అకౌంటెంట్లు తదితరులు పాల్గొన్నారు.


ముగిసిన రాఘవ జయంతి వేడుకలు



నాన్నా నేను వచ్చేస్తా నాటికలో ఓ సన్నివేశం

బళ్లారి సిటీ, ఆగస్టు 4: రాఘవ జయంతితోత్సవాలు ఘనంగా ముగిశాయని రాఘవ కళామందిరం గౌరవాధ్యక్షులు చన్నప్ప తెలిపారు. రాఘవ కళామందిరంలో 144వ జయంతిత్సోవం సందర్భంగా శనివారం రాత్రి తెలుగు నాటికలను ప్రదర్శించారు. నాన్నా నేను వచ్చేస్తా అనే తెలుగు నాటికను గుంటూరు బృందం ప్రదర్శించింది ఈ నాటిక ప్రేక్షకుల హృదయాలను కదిలించి కన్నీరు తెప్పించింది. తణుకుకు చెందిన వాడ్రేవు సుందరరావు నటించిన యయాతి పుత్ర ఏకపాత్ర అభినయనం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. నేటి సమాజంలో జరుగుతున్న సంఘటనలను కళ్లకట్టినట్లు ప్రదర్శించి ప్రేక్షకులకు కనువిప్పు చేశారు. నాన్నా నేను వచ్చేస్తా అనే నాటిక అలాగే ఏకపాత్ర భినయనం విశేషంగా ఆకట్టుకున్నాయి. రాఘవ కళామందిరం గౌరవాధ్యక్షులు చన్నప్ప, అధ్యక్షులు కోటేశ్వరరావు,కమిటీ సభ్యులు బసవరాజు, ధనుంజయ, శ్యామ్‌సుందర్, రామాంజనేయులు, రమణప్ప భజంత్రి తదితరులు పాల్గొన్నారు.

ఆషాఢ అమావాస్యకు పోటెత్తిన భక్తులు



నగరంలోని వివిధ ఆలయాల్లో ఆదివారం అమావాస్య సందర్భంగా విశేష పూజలు జరిపారు. బళ్లారి నగరంలోని దుర్గామాత ఆలయం, ఏకుమక్కల తాయి, కోటమల్లేశ్వర స్వామి, సాయిబాబా, రాఘవేంద్ర స్వామి, ఆంజనేయస్వామి, బాలాంజినగర్‌లోని బాలాంజనేయస్వామి, కాశీవిశ్వనాథ ఆలయం, సండూరు తాలుకాలోని కుమారస్వామి, కంప్లి షుగర్ ఫ్యాక్టరీలోని కాళికాదేవి ఆలయం, సిరుగుప్ప శ్రీ తాయమ్మ దేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయాల్లో వివిధ అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు ఉదయాన్నే దైవ దర్శనం చేసుకోవడానికి బారులు తీరారు. అనంతరం భక్తులు భారీగా మొక్కులు తీర్చుకున్నారు. - ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

4వేల మందితో స్టీల్ సిటీ రన్

బళ్లారి సిటీ, ఆగస్టు 4: నగరంలో ఆదివారం ప్రారంభించిన స్టీల్ సిటీ రన్‌లో దేశంలోని 11రాష్ట్రాల నుండి 4వేల మందికి పైగా పాల్గొన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు రోజువారీ రన్నింగ్‌పై అవగాహన కల్పించేందుకు ఈ పోటీ నిర్వహించారు. బళ్లారి సైక్లింగ్ క్లబ్ నుండి ఉదయం జరిగిన 10కి.మీ రేసులో సుమారు 10మందికి పైగా పాల్గొనగా, 5కి.మీ రేసులో 3వేల మంది, 3కి.మీ రేసులో 350 మందికి పైగా పాల్గొన్నారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు నుంచి కూడా ప్రజలు పాల్గొనడం విశేషం. తోరణగల్లు జిందాల్ సంస్థ అధినేత మురుగన్, ఎస్పీ శోభరాణి, జస్టిస్ మంజుళా చెల్లూరు తదితరులు ఉదయం పరుగును ప్రారంభించారు. సైక్లింగ్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ రవిశంకర్, డాక్టర్ సుందర్, డాక్టర్ సోమనాథ్ తదితరులు ఉదయం పరుగులో పాల్గొన్నారు. రన్నర్లకు నీరు, ఆరోగ్య పరీక్షలు, అల్పాహారం ఏర్పాటు చేశారు. మైండ్ ట్రీ సహ వ్యవస్థాపకుడు నామకల్ పార్థసారథి, ప్రపంచంలో ఆరు మారథాన్‌లలో పాల్గొని ఐదు సార్లు విజేతగా నిలిచిన మూర్తి ఆర్కే, ఫాస్ట్ రన్నర్ అనూషా పాఠక్ తదితరులు పాల్గొన్నారు.

12నుంచి 17 ఏళ్లపురుషుల 5 కి.మీ రేసును బెల్గాంకు చెందిన శివానంద లక్ష్మణ షిగారే 15.31 నిమిషాల్లో పూర్తిచేయగా, 18నుంచి 34ఏళ్ల విభాగంలో బెంగళూరుకు చెందిన సంజయ్‌కుమార్ పాల్ 17.9 నిమిషాల్లో పరుగెత్తి ప్రథమ స్థానంలో నిలిచారు. 15నుంచి 24ఏళ్ల విభాగంలో 10కి.మీ రేసును మహారాష్ట్రకు చెందిన రాహుల్ సంఘీ 32.28నిమిషాల్లో పూర్తిచేసి మొదటి



స్టీల్ సిటీ రన్‌లో పాల్గొన్న యువతీయువకులు

స్థానంలో నిలిచాడు. నగర ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, ఎస్పీ శోభరాణి ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.5వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.3వేలు, తృతీయస్థానంలో నిలిచిన వారికి రూ.2వేలు బహుమతులుగా అందజేశారు. మహిళా విభాగంలో విజేతలకు డాక్టర్ సోమనాథ్, మోదీ మంజు బహుమతులు పంపిణీ చేశారు.

మొక్కలు నాటి పర్యావరణాన్నికాపాడాలి



ఎమ్మిగనూరు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

కంప్లి, ఆగస్టు 4 : ప్రతిఒక్కరు తమ పరిధిలోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి పరిసరాల సంరక్షణ చేపట్టాలని ఎమ్మిగనూరు ఎస్ఎల్‌వీటీ సంస్థాపకులు రాఘవేంద్రరెడ్డి తెలిపారు. కంప్లి తాలుకా పరిధిలోని ఎమ్మిగనూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కలంగా గాలి కావాలంటే చెట్లు ఎక్కువగా పెంచాలన్నారు. చెట్టు ప్రకృతిలో వుండే కార్బన్‌డయాక్సైడ్‌ను తొలగించి ఆక్సిజన్‌ను అందిస్తుందని తెలిపారు. కనుక ప్రతి ఒక్కరు ఖాళీ స్థలాల్లో మొక్కలునాటి వాటి పెంపకంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీకాంత్, నారాయణ చౌదరి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తగ్గిన తుంగభద్ర వరద



వంతెనకు ఇరువైపులా వున్న చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

కంప్లి, ఆగస్టు 4 : తుంగభద్ర జలాశయం నుంచి నీటి ప్రవాహం ఎట్టకేలకు తగ్గుముఖం పట్టింది. జలాశయం నుంచి 85 వేల క్యూసెక్కులు మాత్రమే నీరు నదికి విడుదల చేస్తున్నారు. అధికారులు కూడా వంతెనపై పూడికను తొలగించేందుకు ముందుకొచ్చారు. పీడబ్ల్యూడీ అధికారుల పరిశీలన అనంతరమే వంతెనపైన వాహనాలు నడిచేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. మొత్తానికి నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో కోట ప్రజలు, చిక్కజంతిగల్ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు 30 కిలోమీటర్లకుపైగా తిరిగివెళ్లాల్సిన పరిస్థితి తప్పిందని మరో రెండురోజుల్లో మరింత వరద తగ్గుముఖం పట్టినట్లయితే తమ పొలాలకు వెళ్లేందుకు అనుకూలిస్తుందని తెలిపారు.

సండూరులో ఫుట్‌పాత్ వ్యాపారం.. నరకప్రాయం



ఫుట్‌పాత్‌పై కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

బళ్లారిరూరల్, ఆగస్టు 4 :సండూరు తాలుకా కేంద్రంలో ప్రతి ఆదివారం కూరగాయల అమ్మకం నరకప్రాయంగా తయారైందని వ్యాపారస్తులు వాపోతున్నారు. రోడ్డుకి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసుకోవాలని, వర్షం వస్తే కూరగాయలు తడిసి కుళ్లిపోతున్నాయని అంటున్నారు. వ్యాపారం జరగకపోయినా, ప్రతి రోజు రూ. 70లు చొప్పున మున్సిపాల్టీ అధికారులకు మార్కెట్ రుసుముగా చెల్లించాల్సి వస్తోందని అంటున్నారు. రోజుకు కేవలం రూ. 150 నుంచి రూ.200 వ్యాపారం జరుగుతుంటే అందులో ప్రతి రోజు అంత మొత్తం ఎలా చెల్లించాలని వారు ప్రశ్నిస్తున్నారు. మిగిలిన దాంట్లో కుటుంబాన్ని ఎలా పోషించాలో అర్థం కావడంలేదని వాపోతున్నారు. ఆదివారం కూరగాయల మార్కెట్‌ను సందర్శించిన బీజేపీ ప్రముఖులు కేఎస్ దివాకర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ సమస్యలను తీర్చే వారు కానరావడంలేదని వారు వాపోయారు. కనీసం వర్షం తడవకుండా తమకు ఏర్పాట్లు చేయాలని వారు కోరుతున్నారు.

పండిన తమలపాకులు

- మూడింతలు పెరిగిన ధర
- ఆనందంలో రైతులు

బళ్లారి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తమలపాకుల ధర బాగా పెరిగింది. ఏకంగా పెండి (12 వేల ఆకులు) ధర రూ.3వేల నుంచి ఇప్పుడు రూ.9వేలకు పెరిగింది. ఆదివారం అమావాస్య, సోమవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆకులకు డిమాండ్ పెరిగిందంటున్నారు. పైగా ఆకుల పంట కూడా బాగా తగ్గిపోవడం కూడా ధర పెరుగుదలకు మరో కారణం. బళ్లారి, విజయనగర, జిల్లాలో హగరిబొమ్మనహళ్లి, హడగలి, హర్పనహళ్లి తాలూకాల్లో తుంగభద్ర బ్యాక్ వాటర్, అలాగే ఇతర వంకల్లో పారే నీటితో ఇక్కడ పండ్లతోటలతో పాటు ఆకు తోటలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఇక్కడ భూ సారం, వాతావరణం కారణంగా సాంప్రదాయ పంటగా ఆకులను సాగు చేయడం ఆనవాయితీ.

ఈసారి రైతులు కొలం ప్రాంతంలోనే ఎక్కువగా సాగు చేశారు. పైగా ఈసారి వీచిన గాలులు, వర్షాలకు ఆకుల రెక్కలు చిరిగిపోవడంతో పంట దెబ్బతింది. కొందరు రైతులు ఆకు పంటను సాగు చేసి నష్టపోయారు. మరి కొందరు రైతులు ఎలాగోలా పంటను కాపాడుకోవడంతో ఇప్పుడు వాటికి మంచి డిమాండ్ పెరిగింది. హగరిబొమ్మనహళ్లి, హర్పణహళ్లి, తాలూకాల్లో పండించే ఆకులను ఇక్కడి రైతులు కంప్లి, బళ్లారి, కొప్పళ, రాయచూరు జిల్లాలలో వినియోగదారులకు విక్రయిస్తారు. శ్రావణమాసంలో వివిధ పూజలు,



శుభకార్యాలకు ఆకులను బాగా వాడడం ఆనవాయితీ. ఇంతకు ముందు డజను ఆకుల ధర రూ. 4 వరకూ ఉండేది. ఇప్పుడు ఏకంగా రూ. 15 పలుకుతుండడంతో వినియోగదారులు అబ్బా ఇంత రేటా? అని నీళ్లు నములుతున్నారు. ఒక రకంగా రైతులకు ఇది మంచిదే అయినా వినియోగదారులు మాత్రం సంతోషం వ్యక్తంచేయడంలేదు.

వాగులోకి పడిపోయిన ఆర్టీసీ బస్సు

- 20 మందికి గాయాలు, ముగ్గురి పరిస్థితి విషమం

రాయచూరు, ఆగస్టు 4 : మాన్వి నుంచి సింధనూరువైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఒకటి స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో వంతెనపై నుంచి అదుపుతప్పి వాగులోకి పడిపోయింది. ఆదివారం ఉదయం జరిగిన ఈ సంఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 20 మందికి గాయాలు కాగా వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మాన్వి నుంచి బయలుదేరిన బస్సు సింధనూరువైపు వెళుతుండగా మాన్వి పట్టణం దాటిన 2 కి.మీ అనంతరం అకస్మాత్తుగా స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో వంతెన సైడ్‌వాల్‌కు ఢీకొట్టింది. అనంతరం వాగులోకి పడిపోవడంతో ప్రయాణీకులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 50 మందికిపైగా ప్రయాణీకులుండగా కండక్టర్ అప్పటికే 30 మందికి పైగా టికెట్‌లు ఇచ్చారు. మరికొంత మందికి టికెట్‌లో ఇస్తున్న క్రమంలోనే ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ముగ్గురు పరిస్థితి తీవ్రంగా ఉండడంతో వారిని మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద వార్త తెలుసుకున్న మాన్వి పోలీసులు సంఘటన స్థళానికి చేరుకుని స్థానికుల సహాయంతో ప్రయాణికులను సురక్షితంగా బయటికి రప్పించారు.

హోసూరు జోన్

అటవీ శాఖ తరపున వయనాడ్‌కు సహాయం



అటవీ శాఖ తరపున వయనాడుకు సహాయ సామగ్రి పంపుతున్న దృశ్యం

హోసూరు(సిఫ్‌కాట్) ఆగస్టు 4: కేరళలోని వాయనాడ్ ప్రాంతంలో జూలై 30న కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో సహాయ చర్యలు చేపట్టేందుకు హోసూరులోని జిల్లా అటవీ కార్యాలయం నుంచి రూ.1.50 లక్షల సహాయ సామగ్రిని ట్రక్కుల్లో వాయనాడ్‌కు పంపించారు. ఈ కొండ చరియలు విరిగిపడడంతో 300 మందికి పైగా మరణించగా 200 మంది గాయపడిన విషయం విదితమే. అనంతరం రాష్ట్ర జాతీయ విపత్తు పునరుద్ధరణ బృందాలు ఆ ప్రాంతానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. ఇండియన్ ఆర్మీకి చెందిన 200 మందికి పైగా సైనికులు సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్‌లో మోహరించారు. గాయపడిన 120 మంది స్థానిక ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 3.000 మందికి పైగా ప్రజలను రక్షించి విపత్తు సహాయ శిబిరాలకు తరలించారు. అటవీ ఏజెన్సీలు నుంచి రూ.1.50 లక్షల విలువైన బెడ్‌షీట్లు, మ్యాట్‌లు, ప్లాస్టిక్ కప్పులు, న్యాప్‌కిన్‌లు, పిల్లలకు వేడినీటి బాటిల్స్, టవల్స్‌ను అందించారు. ఈ సామగ్రిని ఆదివారం కేరళలోని ముండక్కై సురళకొండ ప్రాంతంలోని శిబిరాల్లో బస చేసిన బాధితులకు మత్తిగిరిల్లో ఉన్న జిల్లా అటవి అధికారి కార్తీకేయిని నేతృత్వంలో వయనాడుకు పంపారు.

ఎస్టేట్ కాపలాదారులపై హత్యాయత్నం

హోసూరు(క్రైం) ఆగస్టు 4:హోసూరు సమీపంలోని వెంకటేశపురంలోని ఓ ప్రైవేట్ ఎస్టేట్‌లో వాచ్‌మేన్ సీనప్ప(63)పై ఆదివారం హత్యాయత్నం జరిగింది. అతడు తన భార్య రాజమ్మ, కొడుకులతో శనివారం రాత్రి కాపలా కాసేందుకు వెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున ఆటోలో వచ్చిన ఐదుగురు ముసుగులు ధరించి అతనిపై హత్యాయత్నం చేశారు. అంతలోనే జనం అటుగా రావడంతో వారు పారిపోయారు. వారిని గమనించిన ప్రజలు వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి వచ్చిన అంబులెన్స్‌లో వారిని హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈవిషయంపై బాగలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని ఎవరు ఇలా హత్యాయత్నం చేశారు? ఎందుకు అనే కోణంలో ముమ్మరంగా విచారణ చేస్తున్నారు.

తొరపల్లి అగ్రహారంలో ఘనంగా ఆడికృత్తిక

హోసూరు ఆగస్టు 4: శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారికి ఆడికృత్తిక ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హోసూరు సమీపాన తొరపల్లి అగ్రహారంలో వెలసివున్న శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. శనివారం రాత్రి 7 గంటలకు మూకొండపల్లి భక్త బృందంచే కోలాటాలు, నృత్యాలు జరిగాయి. ఆదివారం ఉదయం 10 గంటలకు శంకర్ బృందం శూలాలు గుచ్చుకుని సుబ్రహ్మణ్య స్వామికి పాల బిందెలతో ఊరేగింపుగా కావడీలు తీసుకుని వెళ్లారు. సుబ్రహ్మణ్య స్వామి కీర్తనలు పాడుతూ , ఆడుతూ ఊరేగింపుగా దేవాలయం చేరుకున్నారు. తమిళుల ఆడి మాసం కావడంతో ఆడి అమావాస్యను పురష్కరించుకుని మూడు రోజులు పాటు తొరపల్లి భక్త మండలి అన్నదానం, తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పంచాయతీ అధ్యక్షులు, సమితీకౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు , మాజీ అధ్యక్షులు, గ్రామస్తులు, గ్రామపెద్దలు, భక్తాదుల బంధుబాంధవులు అందరు కలిసికట్టుగా పాల్గొన్నారు.



ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

సింధనూరు-రాయచూరు రైల్వే లైను 2027 నాటికి పూర్తి

రైల్వే శాఖ సహాయ మంత్రి సోమణ్ణ

రాయచూరు, ఆగస్టు 4 : జిల్లా ప్రజలకు అత్యంత కీలకంగా ఉండే సింధనూరు-రాయచూరు రైల్వే మార్గాన్ని 2027లోగా పూర్తి చేస్తామని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమణ్ణ భరోసాఇచ్చారు. కలబుర్గి నుంచి బెంగళూరుకు వెళ్లే వందే భారత్ రైలు-22232కు అదనంగా యాదగిలో స్టాప్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఆదివారం ఆయన లాంఛనంగా హాల్టింగ్‌కు పచ్చజెండా ఊపి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడిన సోమణ్ణ గిణిగేరా-మహబూబ్ నగర్ రైల్వే లైన్ పూర్తి కావడం వల్ల హుబ్లీ-హైదరాబాద్ మధ్య దూరం తగ్గడమేకాక ఈ ప్రాంత ప్రయాణీకులకు మరింత మెరుగైన రవాణ సౌకర్యం కలుగుతుందన్నారు. ఇప్పటికే రాయచూరు-మహబూబ్‌నగర్ వరకు రైల్వే లైన్ అందుబాటులోకి వచ్చిందని, కేవలం సింధనూరు-రాయచూరు మధ్య మాత్రమే మిగిలి ఉన్న ఈ రైల్వే లైన్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.



యాదగిరిలో వందే భారత్ రైలును స్వాగతిస్తున్న ప్రముఖులు

సాగునీటి కోసం రైతుల ఆందోళన

రాయచూరు, ఆగస్టు 4 : తుంగభద్ర ప్రధాన ఎడమ కాల్వ చివరి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలంటూ రైతులు ఆందోళనకు దిగారు. ఆదివారం కర్ణాటక రైతు సంఘం ఆధ్వర్యంలో ఒక్కసారిగా రైతులు రాయచూరు-సింధనూరు ప్రధాన రహదారిపై మాన్వి తాలూకా నీరమాన్వి వద్ద ఆందోళనకు దిగడంతో వాహనాలు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. ఈ సందర్భంగా మాట్లాడిన రైతు సంఘం నాయకుడు చామరస మాలిపాటిల్, ప్రధాన కాల్వ మైల్ నెంబర్ 69, 104లలో నిర్దేశిత గేజ్ మేరకు నీటిని విడుదల చేయకపోవడం వల్ల తీవ్రఅసౌకర్యానికి గురవుతున్నట్లు తెలిపారు. తగిన చర్యలు చేపట్టకపోతే మరోసారి తాము ఆందోళన చేసేందుకు సిద్ధమని హెచ్చరించారు. కాగా ప్రధాన రహదారి పై రైతులు ఆందోళనకు దిగి వాహనాలు నిలిచిపోవడంతో అక్కడికి చేరుకున్న మాన్వి తహసీల్దార్, ఎస్ఐ రైతులకు నచ్చచెప్పి వారికి శాంతింప చేశారు.




నీరమాన్వి వద్ద రోడ్డుపై బైఠాయించిన రైతులు

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

బెజవాడ గోపాలరెడ్డి (జయంతి)



స్వాతంత్ర్య సమరయోధుడు, బహుభాషావేత్త డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి 1907 ఆగస్టు 5న నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జన్మించారు. జాతీయోద్యమంలో జైలుశిక్ష అనుభవించారు. మద్రాస్ ప్రెసిడెన్సీలో 1955 నుంచి 1956 వరకు ఆంధ్ర రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. 1967 నుంచి 1972 వరకు ఉత్తరప్రదేశ్‌కు గవర్నర్‌గా వ్యవహరించారు. కేంద్ర, రాష్ట్రాల్లో మంత్రి పదవుల్లో కొనసాగారు. తెలుగు భాషా సమితి అధ్యక్షుడిగా వ్యవహరించి సాహిత్యాన్ని ప్రోత్సహించారు. గీతాంజలి వంటి రచనలను తెలుగులోకి అనువాదం చేసి ఆంధ్ర ఠాగూర్‌గా పేరొందారు. 1997 మార్చి 9న కన్నుమూశారు.

ఆలూరు వెంకటసుబ్బారావు (జయంతి)



కలంపేరు 'చక్రపాణి'గా పేరొందిన ఆలూరు వెంకట సుబ్బారావు 1908 ఆగస్టు 5న గుంటూరు జిల్లా తెనాలిలో జన్మించారు. బహుభాషావేత్త, తెలుగు రచయిత, పత్రికా సంపాదకుడు, సినీ నిర్మాత, దర్శకుడు, ప్రత్యేకించి చందమామ - విజయా కంబైన్స్ నిర్మాణ సంస్థను స్థాపించిన వారిలో ఒకడు. పాతాళ భైరవి, మాయా బజార్, గుండమ్మ కథ, మిస్సమ్మ, షావుకారు, అప్పు చేసి పప్పుకూడు, 'స్వర్గసీమ' సినిమాలతో ఎంతో పేరొందారు. 1975 సెప్టెంబరు 24న కన్నుమూశారు.

నీల్ అల్డెన్ ఆర్మ్‌స్ట్రాంగ్ (జయంతి)



చంద్రుడిపై నడిచిన తొలి వ్యక్తిగా గుర్తింపు పొందిన నీల్ అల్డెన్ ఆర్మ్‌స్ట్రాంగ్ 1930 ఆగస్టు 5న జన్మించారు. అమెరికా దేశానికి చెందిన ఆయన వ్యోమగామిగా, ఏరోనాటికల్ ఇంజనీర్‌గా రాణించారు. నావల్ ఏవియేటర్, టెస్ట్ పైలట్, యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. 1962లో నాసా ఆస్ట్రోనాట్ కార్ప్స్‌లో చేరారు. మానవత్వం వైపు వేసే ప్రతి అడుగు ఎంతో గొప్పదనే ఆయన వ్యాఖ్యలు ఎంతో ప్రభావితం చేశాయి. ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం, కాంగ్రెసెషనల్ గోల్డ్ మెడల్ తదితర అవార్డులు అందుకున్నారు. 2012 ఆగస్టు 25న కన్నుమూశారు.

కాజల్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత కాజల్ 1974 ఆగస్టు 5న ముంబైలో జన్మించారు. హిందీ సినీరంగంలో అత్యధిక రెమ్యూనరేషన్ అందుకుంటున్న నటీమణులలో ఒకరు. ఆరు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. ఆమె సాధనలకు గాను మేడమ్ టుస్సాడ్ మ్యూజియంలో మైనపు బొమ్మ ఏర్పాటు చేశారు. చిన్నారులు, వితంతుల సంక్షేమం, సమాజసేవలోనూ రాణిస్తున్నారు. నటుడు అజయ్ దేవగన్‌ను పెళ్ళాడారు.

కలకలం..

ప్రధాన రహదారిలోని ఏటీఎంలో చోరీ

కట్టర్లతో కట్ చేసి నగదు అపహరణ

కర్ణాటకలో ఇద్దరి పట్టివేత?

పరారీలో మరొకరు..

అనంతపురం క్రైం, ఆగస్టు 4: నగరంలో ఆదివారం తెల్లవారుజామున కలకలం రేగింది. రద్దీగా ఉండే.. రామ్‌నగర్ ప్రధాన రహదారిలోని ఏటీఎంలో దొంగలు పడ్డారు. నిత్యం రద్దీగా ఉండే, రాత్రిపూట వాహనాలు తిరిగే ప్రాంతంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ చేశారు. మొహాలకు మాస్కులు ధరించిన ముగ్గురు దర్జాగా కారులో వచ్చారు. ఒకరేమో ఏటీఎం కేంద్రంలోని సీసీ కెమెరాలకు బ్లాక్ స్ప్రే కొట్టారు. తర్వాత ముగ్గురూ కలిసి కట్టర్లతో ఏటీఎం మిషన్‌ను కట్ చేసి, అందులోని రూ.29.81 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. ఈ మొత్తం తతంగాన్ని 15 నిముషాల్లోనే పూర్తి చేశారంటే ఆ దొంగలు ఎంత అనుభవజ్ఞులో అర్థం చేసుకోవచ్చు. ఆదివారం తెల్లవారుజామున 2.40 గంటల సమయంలో ఈ చోరీకి పాల్పడ్డారు. ముగ్గురు దుండగులు చోరీ చేసినట్లు సీసీ టీవీ ఫుటేజీ ద్వారా పోలీసులు నిర్ధారించారు.

మోగిన అలారం

దొంగలు పడ్డ వెంటనే ముంబైలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో అలారం మోగింది. వెంటనే అక్కడి నుంచి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి సమాచారం అందింది. అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్, నాలుగో పట్టణ సీఐ ప్రతాప్‌రెడ్డితోపాటు నగరంలోని సీఐలు రెడ్డప్ప, క్రాంతికుమార్, ధరణికిషోర్.. సిబ్బందితో కలిసి రంగంలోకి దిగారు. అప్పటికే దుండగులు కారులో పరారయ్యారు. దొంగలు మూడు, నాలుగు రోజులుగా రెక్కీ నిర్వహించినట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో పట్టివేత?

ఏటీఎం చోరీకి పాల్పడిన ఇద్దరు.. పోలీసులకు పట్టుబడినట్లు తెలుస్తోంది. ఓ దొంగ పరారవగా.. అతడి కోసం పోలీసు బృందాలు అన్వేషిస్తున్నాయి. దొంగలు వాడిన వాహన లొకేషన్‌ను పోలీసులు టోల్‌గేట్లలో ఫాస్టాగ్ ఆధారంగా పట్టేశారు. స్థానిక పోలీసులకు సమాచారం అందేసరికి ఆ వాహనం కర్ణాటకలోని తుమకూరు సమీపంలోని ధావనగెరికి వెళ్లినట్లు తెలిసింది. దీంతో జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ.. కర్ణాకట పోలీసులతో మాట్లాడారు. ఆ సందర్భంలో ఓ పోలీసు వాహనాన్ని దొంగలు ఢీకొట్టారు. ఇందులో ఎవరికీ ఏమీ కాలేదు. అనంతరం బాగల్‌కొటె సమీపంలో ఇద్దరు దొంగలను పట్టేశారని సమాచారం. దొంగలది హరియాణా రాష్ట్రంలోని మేవాడ్ అని సమాచారం. చోరీలు చేసేందుకు వారు విమానాల్లో వస్తారని పోలీసుల ద్వారా తెలుస్తోంది. ప్రధాన రహదారిలోని ఏటీఎంలో చోరీ జరగడంతో పోలీసు గస్తీపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏసీఏ త్రిసభ్యకమిటీలో మాంచోఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 4: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ త్రిసభ్య కమిటీలో జిల్లాకు చెందిన ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్‌కు చోటు దక్కింది. ఇటీవల అసోసియేషన్ కార్యవర్గం రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం రాజధాని అమరావతిలో నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో త్రిసభ్య కమిటీని నియమించారు. నూతన కార్యవర్గం ఎంపిక అయ్యేవరకు త్రిసభ్య కమిటీ ఏసీఏ కార్యకలాపాలు, క్రికెట్ పోటీల నిర్వహణను పర్యవేక్షిస్తుంది

దేశం తిరగండి... నెలవారీ కంతులు కట్టండి



▸▸ సీనియర్ సిటిజన్లకు ఎంఎస్ఐఎల్ ఆఫర్

బెంగళూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వయసు పైబడుతోంది.. ఇక ఎటూ వెళ్లలేం... ప్రముఖ పుణ్యక్షేత్రాలు పర్యాటక కేంద్రాలు సందర్శించాలనే ఆసక్తి ఉన్నా ఒక్కసారిగా ఆర్థిక సమస్య ఏర్పడుతుందని భావిస్తున్నవారికి ప్రభుత్వరంగ సంస్థ మైసూరు సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) బంపర్ ఆఫర్ ఇస్తోంది. వృద్ధాప్యంలో దేశమంతటా తిరగాలని భావించే సీనియర్ సిటిజన్‌లకు పర్యాటక సురక్షితం గురించి ఆలోచించాల్సిన పనిలేదు. వెంటనే పూర్తిగా సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదు. తొలుత టూర్‌కు వెళ్లి ఆ తర్వాత నెలవారీ కంతులుగా నగదు చెల్లించవచ్చు.

వివిధ విభాగాల్లో సేవలు...

రాష్ట్ర ప్రభుత్వానికి అనుబంధమైన ఎంఎస్ఐఎల్ ద్వారా దశాబ్దాల కాలంగా మైసూరు శాండల్ సోప్‌లు, సిమెంట్, లాటరీ, ఎయిర్ కార్గో, పట్టుచీరలు, హోల్‌సేల్ లిక్కర్, టూరిజం ఇతరత్రా సేవలు కొనసాగుతున్నాయి. ఇలా భిన్నమైన విభాగాలలో సేవలందిస్తున్న ఎంఎస్ఐఎల్ సీనియర్ సిటిజన్‌లకోసం ప్రత్యేక పథకానికి శ్రీకారం చుట్టింది. టూర్స్ అండ్ ట్రావెల్ సేవలు దశాబ్దాలకాలంగా అమలు చేస్తోంది. తాజాగా సీనియర్ సిటిజన్‌లను సంతృప్తి పరిచి వారిని అభిమానంతో పర్యాటక కేంద్రాలను సందర్శించేలాంటి వెసలుబాటు తీసుకొచ్చారు. వారికి అవసరమైన భోజనం, వసతి, వారు కోరుకున్న రవాణా, విమానం, రైలు వంటి సౌలభ్యం కల్పిస్తారు. కిచెన్ విత్ ట్రావెల్, డోర్ టు డోర్ ట్రావెల్, ఇఎంఐ విత్ ట్రావెల్ ప్యాకేజీలను పరిచయం చేస్తోంది. తొలి విడతగా సెప్టెంబరులో ఆదికైలాశ్ - వారణాశికు టూర్ చేస్తోంది. ఇందుకు ఏర్పాట్లు చేస్తూ ఆన్‌లైన్ బుకింగ్‌ను పర్యాటకులకు అందుబాటులో ఉండేలా చేసింది. సాధారణంగా ఆన్‌లైన్ ప్యాకేజీలలో టూర్‌కు వెళ్తే ఎక్కడ బయల్దేరాలి, ఎక్కడ భోజనం చేయాలి, ఎక్కడ వసతి సమకూర్చుకోవాలి, పూజలు ఏ విధంగా జరుపు కోవాలనే సందేహాలు ఉంటాయి. అయితే ఎంఎస్ఐఎల్ టూర్‌లో సంస్థ వలంటీర్‌లను ఏర్పాటు చేసింది. వారే అవసరమైన సౌలభ్యాలను సమకూరుస్తారు. ప్రతి ట్రిప్‌లోనూ కనీసం వందమంది బృందంగా సామూహిక పర్యాటకం అమలు చేస్తారు.

నెలవారీ కంతుల విధానం

ఇతర రాష్ట్రాలకు ఒక వారం పర్యటనకు విమానంలో వెళ్లాలంటే రూ.30-40వేలు అవుతుంది. ఇటువంటి వారి కోసమే నెలసరి కంతుల విధానాన్ని తీసుకొచ్చారు. ప్రతి నెలా డబ్బుకట్టి పర్యాటకం చేయవచ్చు. ఇందులో లక్కీడిప్ స్కీమ్ కూడా ఉంది. ఒకబ్యాచ్‌లో కనీసం ముగ్గురు నలుగురి పేర్లను లక్కీడిప్ ద్వారా ఎంపిక చేస్తారు. వారు అప్పటిదాకా చెల్లించిన ఇఎంఐతోనే కంతులు ముగుస్తాయి. లక్కీ డిప్‌లో ఎంపికైతే మిగిలిన కంతులు చెల్లించాల్సిన అవసరం లేదు. ఇలా లక్కీడిప్ స్కీమ్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. పర్యాటకులకోసం ప్రత్యేక హెల్ప్‌లైన్, వాట్సప్ నెంబరులను ఏర్పాటు చేశారు. 24 గంటలపాటు పని చేయనుంది. ఇందుకోసం ప్రత్యేక బృందాన్ని నియమించుకున్నారు. ఒక నెంబరు బిజీగా వస్తే మరో నెంబరుకు బదిలీ అవుతుంది.

పచ్చదనాన్ని కాపాడుకోవాలి



మొక్కలు నాటుతున్న మాజీ మంత్రి అరవింద లింబావళి

మహదేవపుర, ఆగస్టు 4: అభివృద్ధి పేరిట ఇటీవల కాంక్రీట్ నిర్మాణాలు పెరిగాయని ఈ తరుణంలో పచ్చదనం కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మాజీ మంత్రి, మహదేవపుర టాస్క్‌ఫోర్స్ కమిటీ అధ్యక్షుడు అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. నియోజక వర్గంలోని శాంతినికేతన్ నెక్సస్ మాల్‌లో ఆదివారం సేవ్ ఎర్త్ పేరిట బైక్ ర్యాలీ నిర్వహించారు. మాల్ నుంచి కాటం నల్లూరు వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా అరవింద లింబావళి మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం కేరళ రాష్ట్రం వయనాడ్‌లో బీభత్సానికి ప్రకృతి వైపరీత్యంతో ప్రజలు అతలాకుతలమయ్యారన్నారు. రాష్ట్రంలో కొడగు జిల్లాలో భూమి కుంగి పోవడం ప్రకృతి మనకు హెచ్చరిక అన్నారు. ఇకనైనా మానవాళి అప్రమత్తం కాకుంటే మరిన్ని పరిణామాలు ఎదుర్కొనాల్సి ఉంటుందన్నారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో 1800 నుంచి 3వేల అడుగుల మేర బోర్లు వేసినా నీరు లభించని పరిస్థితి ఉందన్నారు. భూగర్భజలాల పెంపుకోసం ఇంకుడు గుంతలు, వర్షపునీటి సేకరణపై ప్రజల్లో అవగాహన పెరగడంతోపాటు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. మహదేవపుర టాస్క్‌ఫోర్స్ ఇతర విభాగాలతో 9 బృందాలు ఉండగా ప్రభుత్వ గ్రాంట్లు, సీఎస్ఆర్ నిధులతో 69 చెరువులను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకోసం ప్లాస్టిక్ వాడకం తగ్గాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించే బాధ్యత చేపట్టాలన్నారు. ర్యాలీ సందర్భంగా కాటంనల్లూరు చెరువు ఐల్యాండ్‌లో పచ్చదనం కోసం ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇందిరానగర్ బ్లైండ్ స్కూల్ సంస్థాపకులు రకుమ్, సెయింట్ క్లారెట్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ ఫాదర్ సోజల్, మిస్టర్ ఇండియా అరుణ్‌గౌడ, బైకింగ్ కమ్యూనిటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఆశిశ్, కల్నల్ జాకబ్, బీజేపీ ప్రముఖులు హరాడి పిళ్ళప్ప, రాజేశ్, పార్టీ కార్యకర్తలు, పెద్దసంఖ్యలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

23న రీసెర్చ్ సిటీకి శ్రీకారం

బెంగళూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ప్రప్రథమంగా కర్ణాటక నాలెడ్జ్ హెల్త్ ఇన్నోవేషన్ రీసెర్చ్ సిటీ (కేహెచ్ఐఆర్) ప్రాజెక్టు తొలి విడతకు ఈనెల 23న లాంఛనంగా శ్రీకారం చుడతామని భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ తెలిపారు. కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సమీపాన కేహెచ్ఐఆర్‌ను 2వేల ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయదలిచామన్నారు. తొలుత వెయ్యి ఎకరాలలో ఆరంభం కానుందన్నారు. రెండు విడతలలో కలిపి రూ.40వేల కోట్ల పెట్టుబడులు సాధ్యం కానున్నాయని తద్వారా 50వేలకుపైగా ఉద్యోగాల కల్పన వీలవుతుందన్నారు. ప్రపంచస్థాయిలో అత్యున్నత కంపెనీలు ఇక్కడికి రానున్నాయన్నారు. వీటికి అవసరమైన భూమి, విద్యుత్, నీరు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు రాష్ట్రప్రభుత్వం సమకూర్చనుందన్నారు. విశ్వవ్యాప్తంగా రీసెర్చ్ సిటీల పరికల్పన ఉందని కేంద్రప్రభుత్వం కూడా ఇదే మోడల్‌ను అనుసరిస్తోందన్నారు. రాష్ట్రంలో రీసెర్చ్ సిటీ మహత్తరమైన ప్రాజెక్టు కానుందన్నారు. ఆర్థిక ఆదాయం పెరగనుందని, ఎగుమతులు పెరుగుతాయన్నారు. తద్వారా బెంగళూరు మరో విధంగా పేరొందనుందన్నారు. ప్రపంచంలోని ప్రముఖ పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు, మెడికల్ టూరిజం, పరిశోధనలు చికిత్సలు, ఆవిష్కరణల ఉద్దేశ్యంతోనే సిటీలో ప్రాధాన్యత ఇస్తామన్నారు. భవిష్యత్తులో సంచార వ్యవస్థ, సెమి కండక్టర్, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, స్టార్టప్‌లు, ఏరోస్పేస్, డిఫెన్స్, అంతరిక్ష పరిశోధన, బయో సైన్స్, ఆధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కంపెనీలు ఇక్కడికి రానున్నాయన్నారు. పరోక్షంగా భారీ స్థాయిలో ఉద్యోగాలు లభించనుందని ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణకు సిద్ధమైందన్నారు.

సీఎం సిద్దూపై కేంద్రం కక్షపూరిత ధోరణి



మీడియాతో ఎమ్మెల్యే నారాయణస్వామి

బంగారపేట, ఆగస్టు 4: ఎలాంటి అవినీతి మచ్చలేని సిద్దరామయ్యపై కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తోందని రాష్ట్ర నగర మౌలిక సదుపాయాలు, ఆర్థికాభివృద్ధి మండలి అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి ఆరోపించారు. ఎస్ఎన్‌సిటీ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాలు రాజ్యాంగ వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని, కేంద్రం చేతిలో గవర్నర్ కీలుబొమ్మగా మారారని ఆరోపించారు. ప్రజాదరణ పొందిన సిద్దరామయ్య చక్కటి పాలన అందిస్తున్నారన్నారు. సీఎం వర్చస్సుకు భంగం కలిగించేందుకు బీజేపీ పలు ఆరోపణలు చేస్తోందన్నారు. ప్రజాప్రభుత్వాలను అస్థిరం చేసేందుకు బీజేపీ అలవాటుగా మారిందన్నారు. కాగా సిద్దరామయ్య 40ఏళ్ల రాజకీయ జీవితంలో ఒక మచ్చ కూడా లేదన్నారు. సీఎం భార్య పార్వతమ్మకు చెందిన 3 ఎకరాల 16 కుంటలను ముడా అక్రమంగా స్వాధీనం చేసుకుని రోడ్లు, పార్కు, ఇతరత్రా ఉపయోగాలకు కేటాయించారని ఇందుకు పరిహారంగా 50:50 నిష్పత్తిలో వేర్వేరు చోట్ల ఇంటి స్థలాలు ఇచ్చారని ఇందులో ఎలాంటి అక్రమాలు లేవన్నారు. బీజేపీ, జేడీఎస్ నాయకుల ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అవినీతి లేకున్నా కేవలం ఆరోపణలతో చలో మైసూరు పాదయాత్ర చేపట్టడం అర్థరహితమన్నారు. కాగా కేంద్ర బడ్జెట్‌లో కర్ణాటకకు అన్యాయంపై ఈనెల 6న పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి బజార్ రోడ్డు మీదుగా భారీ ర్యాలీ ఉంటుందన్నారు.

గ్రే యూనిఫాంకు కోల్కత్తా చిత్రోత్సవ పురస్కారం



డాక్యుమెంటరీ పోస్టర్

బెంగళూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రమాదాలపై అవగాహన కల్పించేలా రూపొందించిన ది ఫస్ట్ జర్నీలో భాగంగా గ్రే యూనిఫాం డాక్యుమెంటరీకి అత్యున్నత పురస్కారం లభించింది. 13వ కోల్కత్తా అంతర్జాతీయ లఘు చిత్రోత్సవం 2024లో స్పెషల్ మెన్షన్ పురస్కారం దక్కినట్టు డాక్యుమెంటరీ రూపకర్త డాక్టర్ వినోద్ రాజేంద్ర వెల్లడించారు. ఆదివారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ నైరుతి రైల్వే భద్రతా అవగాహనలో భాగంగా ఐసీఐసీఐ ఫౌండేషన్ సహకారంతో డాక్యుమెంటరీను రూపొందించామన్నారు. రైల్వే ప్రయాణీకుల సురక్షితం కోసం ఎంతోమంది ఉద్యోగులు శ్రమిస్తుంటారన్నారు. డి గ్రూప్ ఉద్యోగుల బూడిదరంగు యూనిఫాం ధరిస్తారని అందుకే గ్రే యూనిఫాం పేరిట డాక్యుమెంటరీని చిత్రీకరించామన్నారు. నా తండ్రి రాజేంద్ర నాయుడు రైల్వే విశ్రాంతి ఉద్యోగి కావడం మనస్సుకు దగ్గరగా ప్రాజెక్టు రూపొందించామన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



పండ్లు అందజేస్తున్న సురేంద్రగౌడ తదితరులు

శిడ్లఘట్ట, ఆగస్టు 4: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు బీజేపీ హోబళి తాజా మాజీ అధ్యక్షుడు కంబదహళ్ళి సురేంద్రగౌడ పంపిణీ చేశారు. తన 56వ పుట్టినరోజును పురస్కరించుకుని అర్థవంతంగా సరళంగా ఆచరించారు. బీజేపీ తాలూకా అధ్యక్షుడిగా రెండుసార్లు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఐదేళ్లపాటు వ్యవహరించి చిక్కబళ్ళాపుర జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఆదివారం సురేంద్రగౌడకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. నగరసభ సభ్యుడు నారాయణస్వామి, తాలూకా ఉపాధ్యక్షుడు మునిరాజు, పట్టణ అధ్యక్షుడు నరేశ్, మహిళామోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నర్మదారెడ్డి, తాలూకా ప్రధాన కార్యదర్శి రజనీకాంత్ బాబు, నాగేశ్, మోహన్, ఎస్టీ మోర్చా నింగప్ప తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి దేవికి విశేష పూజలు



దొమ్మసంద్ర, ఆగస్టు 4: ఆనేకల్ తాలూకా దొమ్మ సంద్ర గ్రామంలో కొలువైన చౌడేశ్వరి దేవి జయంతిని పురస్కరించుకుని ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని పుర వీధులలో ఊరేగించారు. అమ్మవారి జయంతిలో వేలాది మంది భక్తులు, పెద్దసంఖ్యలో తొగటవీర కులస్తులు, పాల్గొన్నారు. చౌడేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాసోహం నిర్వహించారు. దొమ్మసంద్ర తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. ఇతర ఆలయాల్లోనూ ఆషాఢ అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆదివారం కావడంతో పలు ఆలయాల్లో రద్దీ అధికంగా కనిపించింది.

అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

శ్రావణం... ఆధ్యాత్మిక పరిమళం

మాసంలో ప్రతిరోజూ పండుగే

హనుమాన్ దర్శన్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 4: మాసంలో ఒకరోజు ప్రత్యేకం లేదా.. ఒక వారం ప్రత్యేకం ఉంటుంది. అయితే మాసంలోని ప్రతిరోజూ ఓ పండుగే అంటే అది శ్రావణమాసమే. తెలుగు క్యాలెండర్ ప్రకారం ఐదవ నెలలో వచ్చేదే శ్రావణ మాసం. ఎన్నో ఆధ్యాత్మిక ప్రయోజనాలున్న మాసం. ఆదివారం నాటి అమావాస్యతో ఆషాఢమాసం సమాప్తమవగా సోమవారం నుంచి శ్రావణమాసం ఆరంభమైంది. ఈ మాసంలో శివుడికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీ. హిందువులకు శ్రావణమాసం ఎంతో ప్రత్యేకం. ఈనెలలో వచ్చే సోమవారాలు, మంగళవారాలు, శుక్రవారాలు, శనివారాలు ఎంతో పవిత్రమైనవి. అందుకే ఈ నాలుగు వారాలలో ఆలయాలు, ఇళ్లల్లో ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తుంటారు. దక్షిణాయనంలో వచ్చే విశిష్ట మాసాల్లో శ్రావణమాసం ఒకటి. ఈ మాసం శివపూజకు విశిష్టమైనది. అలాగే ఈ నెలలో చేసే ఏ చిన్న దైవ కార్యమైనా వేలరెట్ల శుభఫలితాలనిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఇంతటి పవిత్రమైన, శక్తివంతమైన శ్రావణమాసంలో వచ్చే సోమవారాల్లో చాలామంది ఉపవాసాలుండి పరమశివుడికి అభిషేకాలు చేస్తారు. ఇలా చేయడాన్ని శ్రావణసోమవార వ్రతమని పిలుస్తుంటారు. సూర్యోదయానికి ముందే నిద్రలేచి, స్నానమాచరించి, శివాలయాన్ని సందర్శించి పాలు, నీళ్లు కలిపిన పదార్థంతో శివలింగానికి అభిషేకం చేయాలి. అభిషేకం చేస్తున్నంతసేపు నిర్విరామంగా నమఃశివాయ అంటూ స్తుతించాలి. అదేవిధంగా మంగళవారం చేసే వ్రతాలను మంగళగౌరీ వ్రతాలు అని పిలుస్తుంటారు. ఇక శుక్రవారాల్లో వరలక్ష్మీ వ్రతాలు, శనివారాల్లో విష్ణుమూర్తి అవతారమైన వెంకటేశ్వరస్వామిని స్తుతిస్తూ ఏడుశనివారాల వ్రతాలు నిర్వహించడం ఆనవాయితీ. శ్రావణమాసం చాలా విశిష్టమైంది. శ్రీకృష్ణ జన్మాష్టమి, రక్షాబంధన్, నాగపంచమి పండుగలు ఈ నెలలో వస్తాయి.

హనుమాన్ దర్శన్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసులు

శ్రావణమాసంలోని మంగళ, శనివారాల్లో ఒకేరోజున మూడు ఆంజనేయస్వామి దేవాలయాలను దర్శించుకోవడం జిల్లాలో ఆనవాయితీగా వస్తోంది. ఇందుకోసం ప్రతియేటా అనంత ఆర్టీసీ శ్రావణమాసంలో ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది శ్రావణమాసం కూడా బస్సు సర్వీసులను నడపనున్నట్లు అనంతపురం డీఎం నాగభూపాల్ వెల్లడించారు. ఈనెల 6, 10, 13, 17, 20, 24, 27, 31వ తేదీల్లో కసాపురం, మురడి, నేమకల్లు అంజనేయస్వామి దేవలయాలను దర్శించుకునే భక్తులకోసం బస్సు సర్వీసులను నడపుతున్నట్లు పేర్కొన్నారు. మూడు ఆంజనేయస్వామి దేవాలయాలను ఒకేరోజున దర్శించుకునేందుకు రాను, పోను చార్జీలు పెద్దలకు రూ.495లు, పిల్లలకు రూ.250లుగా నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ముందస్తు రిజర్వేషన్ కూడా ఉందన్నారు.

పుణ్యఫలాలను ప్రసాదించే మాసం

మాసాలన్నింటిలోకెల్లా అత్యధికంగా పుణ్యఫలాలను ప్రసాదించే మాసమేదైనా వుందంటే అది శ్రావణమాసమే. ఈనెల 5 నుంచి సెప్టెంబరు 3వ తేదీ వరకు శ్రావణమాసం వుంటుంది. ముత్తైదువులు ఈ మాసంలో అమ్మవారికి ముఖ్యంగా శ్రీచక్ర కుంకుమార్చన చేసుకోవడంవల్ల శుభఫలితాలను పొందుతారు.

- నరసింహశాస్త్రి, కాశీవిశ్వేశ్వర కోదండ దేవాలయం, అనంతపురం

ఒకే చిరుత... భిన్నమైన కళ్లు


▸▸ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ అరుదైన దృశ్యం



బండీపుర అడవిలో చిరుతకు భిన్నమైన కళ్లు

బెంగళూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భిన్నమైన రంగుల కళ్లు కల్గిన అరుదైన చిరుత ఫోటోను రాష్ట్ర వన్యజీవిమండలి సభ్యుడు, వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్ ధ్రువ పాటిల్ తన కెమెరాలో బంధించాడు. బండీపుర అభయారణ్యంలో ఈ చిరుత కనిపించింది. ఇది అపురూపమైనది, భిన్నమైనదిగా వన్యజీవి నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇందుకు సంబంధించిన ఫోటో సోషల్ మీడియాలో రెండురోజులుగా వైరల్ అవుతోంది. ఇందుకు వంశపారంపర్యమైన కారణాలు ఉంటాయని, శాస్త్రీయ పరిభాషలో హెటెరో క్రోమియా ఇరిడస్‌గా పిలుస్తారు. ధ్రువపాటిల్ తీసిన ఈ ఫోటో చిరుతలకు సంబంధించి రికార్డుల నమోదుకు ఒక మార్గదర్శకం కానుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ కుమారుడు 21ఏళ్ల ధ్రువ పాటిల్ కొంతకాలంగా వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్‌గా జీవలోక వైవిధ్య అవగాహనలో ఆసక్తి కల్గి ఉన్నారు. సఫారి చేసే హాబీ కలిగి ఉన్నారు. బండీపుర, కబిని, దాండేలి అటవీప్రాంతాలలోనే ఎక్కువ సమయం గడుపుతుంటారు. గతంలో కబిని ఆనకట్ట సమీపంలో నల్ల చిరుతను కెమెరాలో బంధించారు

అమావాస్య విశేషపూజలు



నగరేశ్వరస్వామికి అలంకరణ

విజయపుర, ఆగస్టు 4: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో ఆషాఢ అమావాస్యను పురస్కరించుకుని హరిహర సంగమ క్షేత్రంలోని నగరేశ్వర స్వామి ఆదినారాయణస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నపూర్ణ సమేత నగరేశ్వర స్వామి మూల విరాట్టు, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, పుష్పాలంకరణ చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.